www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 జనవరి 2024





# శ్రీవారిని దర్శించుకున్న నటి శ్రియ

**ప్రాజాశక్తి-తిరుమల:** తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీనటి శ్రియా దర్శించుకుంది. ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని, హుండీలో కానుకలు సమర్పించి శ్రియా మొక్కుల చెల్లించుకుంది. ఈసందర్భంగా ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన అందాలనటి శ్రియా తో పలువురు ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు.

# అంగన్వాడీల ఆర్తనాదాలు పట్టవా..?

## విజయవాడకు బయలుదేరిన కార్యకర్తలు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

అంగన్వాడీ చేస్తున్న పోరాటం ఆదివారం నాటికి 41వ రోజుకు చేరుకున్నది. గత 41 రోజులుగా అంగనవాడీ అక్క చెల్లెమ్మలు వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుంటే ఈ ముఖ్యమంత్రి వారి ఆర్తనాదాలు పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. ఈసందర్భంగా సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ 41 రోజులుగా నిరవధికంగా ఆడబిడ్డలు అలుపెరగకుండా పోరాడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవ్వుకుంటున్నాడని, నిన్ను చూసి జనం నవ్వుకునే రోజులు ఎంతో దూరంలో లేవని అతి తర్వరలోనే నిన్ను శాశ్వతంగా ఇంట్లో కూర్చుని పరిస్థితి వస్తుందన్నారు. అంగన్వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, సుజిత, రోజా యువరాణి, కల్పన, గీత, గోమతి, ఎల్లమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు

**గూడూరు టౌన్:** పట్టణంలో అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 41 వ రోజులకీ చేరుకొంది. తిరుపతి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.హేమలత శిబిరం వద్దకు చేరుకొని సమ్మెకు తమ పూర్తి మద్దతు ప్రకటించడం జరిగింది. అనంతరం కామ్రేడ్ లెనిన్‌కు శత వర్ధంతి సందర్భంగా దీక్ష శిబిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళుర్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి మీద ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి.రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట నుంచి విజయవాడకు బయలుదేరిన అంగన్వాడీలు

**సూళ్లూరుపేట:** సూళ్లూరుపేటలో అంగన్వాడీల సమ్మె 41వ రోజుకు అంగన్వాడీ జిల్లా నాయకురాలు మేకల హైమావతి ఆధ్వర్యంలో చేరింది. ఈకార్యక్రమానికి సిఐటియు నాయకులు సమ్మెకు మద్దతు తెలియజేశారు.

**పుత్తూరు టౌన్:** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు ఆగవని అంగన్వాడీలు, సహాయకులు కలసి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద 41వ రోజు ఆదివారం ధర్నా నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, అంగన్వాడీలు మునికుమారి, విజయకుమారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తమ హక్కులను అడగడానికి కూడా ఈ రాష్ట్రప్రభుత్వం నిర్బంధం చేయడం దారుణమన్నారు. యూనియన్ నాయకులు, ధనమ్మ, రాధా, లలిత, మోహన్ లక్ష్మి, హైమావతి, అన్నపూర్ణ, కృష్ణవేణి, అరుణ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట

### అంగన్వాడీల అరెస్టుకు సిఐటియు ఖండన

**తిరుపతి టౌన్:** కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అనే పేరిట శాంతియుతంగా విజయవాడకు వెళుతున్న అంగన్వాడీలను రేణిగుంటలో అరెస్టు చేయడాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేయబడ్డ మహిళలను తక్షణం విడిచి పెట్టాలని వారి ప్రజాస్వామ్యతమైన నిరసన కార్యక్రమానికి ఆటంకం కల్పించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేతగాక మహిళలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

పుత్తూరు

గూడూరు

# లెనిన్ విప్లవస్ఫూర్తితో పోరాడుదాం..!

## శత వర్ధంతి సభలో నివాళులు అర్పించిన వామపక్ష పార్టీ నేతలు

**ప్రజాశక్తి-తిరుపతి టౌన్**

మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు, రష్యన్ విప్లవ రథసారథి, సోషలిస్టు వ్యవస్థ వ్యవస్థాపకులు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సిపిఎం, సిపిఐ, రిపబ్లిక్ పార్టీ నేతలు ఆదివారం యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, రిపబ్లికన్ పార్టీ రాష్ట్రఅధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడారు. రష్యాలో లెనిన్ నాయకత్వంలో కార్మికవర్గ రాజ్యం ఏర్పాటు అయ్యిందన్నారు. రష్యా విప్లవ స్ఫూర్తితో ప్రపంచ దేశాలలో స్వతంత్ర కోసం ప్రజలు ఉద్యమించారని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయ మార్గమని నిరూపించిన మహనీయుడని అన్నారు. రష్యాలో భూసంస్కరణలు అమలు చేయడం, ఫ్యాక్టరీలు జాతీయం చేయడం వంటి సంస్కరణలు చేపట్టాడని, దోపిడీలేని వ్యవస్థను, ధనిక, పేదలు లేని సమసమాజాన్ని నిర్మించి పెట్టుబడిదారి సమాజంలో ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేశాడని అన్నారు. లెనిన్ స్ఫూర్తితో దేశంలో మతోన్మాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసిపికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సిపిఐ నాయకులు జె.విశ్వనాథ్, ఏ.రాధాకష్ణ ఎన్‌డి.రవి, సిపిఎం నాయకులు వేణుగోపాల్, బుజ్జి, చిన్న, మల్లికార్జున్ రావు, రమేష్, తంజావూరు మురళి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

**గూడూరు టౌన్:** పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పులామాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా గూడూరు సిపిఎం సెంటర్‌శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించడానికి లెనిన్ అనేక పోరాటాలు చేశారన్నారు. ప్రతిఒక్కరు ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, నాయకులు బి.చంద్రయ్య, వెంకట రామిరెడ్డి, పామంజి మణీ, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

**నాయుడుపేట:** స్థానిక సిఐటియు కార్యాలయంలో శత వర్ధంతి సందర్భంగా లెనిన్ ఫోటోకి పూలమాల వేసి నివాళు లర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.మహేష్‌బాబు మాట్లాడుతూ కేవలం 54 సంవత్సరాల తన జీవితకాలంలో లెనిన్ ప్రపంచ కార్మిక విప్లవ ప్రగతిపైన చెరగని ముద్రను వేశాడన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు ఎస్.ముకుంద, ప్రజానాట్య మండలి నాయకులు గోపాలయ్య, రజక సంఘం నాయకులు పుట్టయ్య పాల్గొన్నారు.

**పాకాల:** మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణను ముందుకు తీసుకుని లెనిన్ చేసిన కృషి చాలా ప్రాముఖ్యమైనదని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ రావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శత వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలో కెవిపిఎస్, సిఐటియు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు నరేంద్ర, ప్రధాన కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి హరి ప్రకాష్, ప్రసాద్, గురుస్వామి, ఉమాపతి పాల్గొన్నారు.



నాయుడుపేట..

గూడూరులో..

## 'లా' కోర్సులో స్పాట్ అడ్మిషన్స్

**ప్రజాశక్తి - క్యాంపస్**

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం కోర్సుల్లో ఎల్‌ఎల్‌బి ఐదు సంవత్సరాలు కోర్సులో 7సీట్లు, ఎల్‌ఎల్‌బి మూడు సంవత్సరాలకు 13చేట్లు మిగిలి ఉన్నాయని న్యాయశాస్త్రం విభాగాధిపతి వెల్లడించారు. మాస్టర్ ఆఫ్ లా, ఎల్‌ఎల్‌ఎంలు కోర్సులు రెండు సంవత్సరాలకు స్పాట్ అడ్మిషన్ జనవరి 23 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. ఏపీ లా సెట్ 2023, ఏపీ పీజీ లాసెట్ 2023 పరీక్షల్లో అర్హత సాధించిన మహిళా విద్యార్థినులు మాత్రమే అడ్మిషన్లకు అర్హులన్నీ వెల్లడించారు. ఈ కోర్సులో అర్హులైన విద్యార్థినులు అర్హత ప్రమాణ పత్రాలు, గుర్తింపు కార్డులు, ఫోటోలు, ర్యాంక్ కార్డులు తీసుకొనిరావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరదలచిన ఆసక్తి ఉన్న విద్యార్థులకు ముఖ్య గమనిక ఏమనగా హాస్టల్ వసతి ఉండదని తెలిపారు.

## ఫేక్ ఓట్లపై మరో కేసు నమోదు

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ**

ఫేక్ ఓట్లుపై మరో కేసు వెస్ట్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం తాజాగా నమోదయింది. దొంగ ఓట్లపై తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్లో ఈనెల 7న కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిన విషయం విధితమే. మొదటి కేసులో తిరుపతి తహశీల్దార్ ఆఫీస్‌కు చెందిన ముగ్గురు ఔట్సోర్సింగ్ సిబ్బందిని ప్రతాప్ నాయక్, శివకుమార్, విజయ్ కుమార్‌లను తొలగించిన విషయం తెలిసిందే. వెస్ట్ పోలీస్‌స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదయింది. ఈ ఓటర్ కార్డులు ఎవరివోతేల్చండి... అంటూ వెస్ట్ పోలీసులకు 5 ఓటర్ కార్డులు ఫిర్యాదుదారులు అప్పగించారు. సప్తగిరి నగర్, సుందరయ్యనగర్, క్రాంతి నగర్‌కు చెందిన లక్ష్మమ్మ, కుమారి, శాంతి, కోమల కోమాంగి, మల్లిక పేర్లు ఉన్న గుర్తింపు కార్డులను ఫిర్యాదుదారులు కార్పొరేషన్ కమిషనర్‌కు అప్పగించారు. దీంతో కార్పొరేషన్ కమిషనర్ హరిత తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వెస్ట్ సిఐ జయనాయక్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గ్రామ బహిష్కరణపై స్పందించాలి: బాలరాజు

**ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)**

తన కుటుంబాన్ని గ్రామంలో నిర్వహించ తలపెట్టిన పూజలకు మహిళ సంఘాల నిధులు ఎందుకు వినియోగిస్తున్నారని ప్రశ్నించిన దానికై గ్రామ బహిష్కరణ చేశారని, గ్రామ బహిష్కరణపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి జోక్యం చేసుకోవాలని బాధితుడు సినీ జానపద గేయ రచయిత బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలరాజు మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని పరమాలపల్లి గ్రామంలో నివసిస్తున్న తన కుటుంబాన్ని గ్రామానికి సంబంధించిన తొమ్మిది మంది గ్రామ ప్రజలను రెచ్చగొట్టి గ్రామ బహిష్కరణ చేశారన్నారు. గ్రామంలో దెయ్యాలు తిరుగుతున్నాయన్న నెపంతో గ్రామంకు నాలుగు వైపులా శక్తి రాళ్లు నాటుకోవడానికి మహిళా సంఘాల నిధులు వాడుకోవడాన్ని వ్యతిరేకించడంతోనే తన తోడబుట్టిన వారిని సైతం తన ఇంటికి రాకుండా అడ్డుకుంటున్నారని, వయోవృద్ధులైన తల్లిదండ్రులు పాలు తెచ్చుకోవడానికి కూడా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాన్ని సందర్శించి గ్రామ బహిష్కరణ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

### అనుమతులు రాక..

# 4వే పనులు పూర్తి కాక..

- కడప - రేణిగుంట హైవే పనులతో ప్రయాణికులకు తప్పని కష్టాలు
- అటవీ శాఖ అనుమతులు లేక ఆగిన పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

రేణిగుంట - కడప నాలుగు వరుసల జాతీయ రహదారి కల ఇప్పట్లో సాకారం అయ్యేలా కనిపించడం లేదు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అటవీశాఖ అనుమతులు లభించలేదు. ఏదేని అభివృద్ధికి అధికారులతో పాటు రాజకీయ కోణంలో అధికారపార్టీ ప్రేరణ ఉండాలి. ఇలా లేకపోవడంతో ఇప్పటికే ఖరారు చేసిన టెండరును రద్దు చేసి మళ్లీ పిలవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియతో ఇప్పట్లో అతిపెద్ద రహదారి ప్రాజెక్టు సాకారం అయ్యేలా కనిపించడం లేదు. నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం ప్రయాణికులు, వాహన చోదకుల పాలిట శాపంగా మారింది.

కడప- రేణిగుంట హైవే..

**స్వామి పాదాల చెంత....**

శ్రీవెంకటేశ్వర స్వామి పాదాల చెంత ఉన్న తిరునగరికి శ్రీనివాసుని తొలి గడప కడప నుంచి నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి కేంద్రం రెండేళ్ల కింద ఆమోద ముద్ర వేసింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఎ) టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. ఈ మార్గాన్ని రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచి ఖరారు చేశారు. రేణిగుంట నుంచి కడప వరకు 130 కి.మీ రహదారి నిర్మాణం జరగనుంది. రేణిగుంట నుంచి రైల్వేకోడూరు వరకు ఇప్పుడున్న పాత రహదారిని వినియోగించుకోనుండగా.. రహదారిని వినియోగించుకోనుండగా.. రైల్వేకోడూరు నుంచి కడప వరకు మార్గం మధ్యలో ఎక్కడా గ్రామాలను తాకకుండా కొత్త రహదారి (గ్రీన్ ఫీల్డ్ రోడ్డు) నిర్మాణం చేపట్టనున్నారు.

తిరుపతి జిల్లాలో 20 కి.మీ, వైయస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 110 కి.మీ పొడవునా రహదారి ఉండనుంది. దాదాపు రూ.2,500కోట్ల అంచనాతో చేపట్టిన రహదారిని రెండేళ్లలో పూర్తి చేయాలనే గడువును నిర్దేశించారు. రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలాపల్లె, శెట్టిగుంట వరకు ఇప్పుడున్న రహదారినే నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. రైల్వేకోడూరుకు ముందు భాగంలో బైపాస్ మార్గం ఏర్పాటుకు పనులు తలపెట్టారు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, బాకరాపేట పడమర దిశగా రహదారి వెళ్లనుంది. ఈ రహదారి ప్రైవేటు భూముల సేకరణ చేపట్టి దాదాపు పరిహారం చెల్లింపులు జరిగాయి. అటవీశాఖ నుంచి దాదాపు 300 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. వీటికి ఎన్హెచ్ఎ అధికారులు వివిధ రూపాల్లో ప్రయత్నిస్తున్నా అనుమతులు రాలేదు.

**పట్టించుకోని ప్రతినిధులు.....**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లేకపోవడం, రాజకీయంగా.. అధికార పార్టీ నుంచి సహకారం లేకపోవడంతో అనుమతుల జాప్యం జరుగుతోంది. ఈ మార్గం పరిధిలో ముగ్గురు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు మట్టి పనులు చేపట్టగా.. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ఆపేయాల్సిన పరిస్థితి వచ్చింది. టెండర్లు ఖరారు చేసి ఏడాది దాటిపోతున్నందున్న ఎస్ఎస్ఆర్ పెరుగుదల కారణంగా కొత్తగా టెండర్లకు వెళ్లాల్సిన పరిస్థితి రావచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రక్రియ అంతా మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలంటే పనులు మరింత ఆలస్యం కానున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి గత ఏడాది జులైలో కేంద్ర మంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కేంద్రం ప్రాధాన్యం ఇస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో రహదారి నిర్మాణం ఆలస్యమవుతోంది.

# అంతా 'అక్రమం'!

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** అక్కడ, ఇక్కడ అని కాదు.. జిల్లాలోని అనేక ఇసుక రీచ్‌లతో అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. అట్టుకట్ట వేయా ల్సిన మైనింగ్, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నోరుమెదపని పరిస్థితి. ఎన్నికల్లో కోట్లు ఖర్చు చేసి ప్రజా ప్రతినిధులు ఇసుక రీచ్‌లు, అక్రమ మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాల లోటును పూడ్చుకొనే పనిలో పడ్డారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిత్తూరు, జీడి నెల్లూరు, గుడిపాల, తవణంపల్లి, యాదమరి ఇలా ఆయా ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన నేతలు ఇసుక అక్రమ రవాణా ఆదాయ మార్గంగా ఎంచుకున్నట్లు ఆప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం వెనకాడడంలేదని అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదంటున్నారు. కలికిరి మండలంలో గుండ్లూరు ఇసుక రీచ్ కాంట్రాక్టర్ మైనింగ్ నిబంధనలను తుంగలో తొక్కుతు న్నారు. రైతులు అనేకసార్లు భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపో తున్నాయని గొంతు చించుకొని కొట్టుకుంటున్న ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మైనింగ్ అధికారులు కాంట్రాక్ట్ కి ఇచ్చిన నిబంధనల్లో స్పష్టంగా 10 మీటర్ల లోపు ఉంటే జేసీబిలతో తవ్వకాలు చేపటరాదనే నిబంధనలు ఉన్నాయి. వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా ఇష్టా రాజ్యంగా హిటాచి లను ఉపయోగించి ఇసుకను ట్రిప్పర్స్ ద్వారా తరలిస్తున్నారు. కూలీల ద్వారా ఇసుక తవ్వకాలు చేపటాలని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను జేసీబి, ఇటాచీల ద్వారా తవ్వకాలు చేపట్టి యద్ఛేగా తరలిచేస్తున్నారు. లైసెన్స్ ఓ చోట త్వకాలు మరోచోట గుండ్లూరు రీచ్ కి ఇచ్చిన లైసెన్స్ తీసుకొని చీకటి పల్లి ఇసుక రీచ్ నుంచి భారీ స్థాయిలో ఇసుక తరలిస్తున్నారని చీకటిపల్లి రైతులు చెబుతున్నారు. అక్రమంగా ఇసుకను తరలించడంవల్ల తమ వాగుల్లో నీరు ఇంకిపోయి పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలను స్థానిక తహశీల్దార్, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు అనేకసార్లు ఇసుక లారీలను అడ్డుకున్న అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలో ఇసుక రీచ్ లు రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో నడుస్తాయి. ఇక్కడ రెవెన్యూ అధికారులు మాత్రం వాటి జోలికి పోవడం లేదు. కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి అధికారులు నిమ్మకుంటున్నారనే ఆరోపలున్నాయి. ఇసుక రీచ్ కాంట్రాక్టర్లకు రైతులకు గొడవలు అవుతున్న రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పర్మిషన్ లకు మించి అదనంగా తరలిస్తున్నారు. ఇసుక రీచ్ లో సీసీ కెమెరాలు ఉండాలని ప్రభుత్వ నిబంధన. ఇక్కడ మాత్రం అలాంటివి ఏమీ లేవు. ఇసుకను ఎవరికి.. ఎందుకు..ఏ అసరాల కోసం ఇసుక ఎన్ని లోడ్లు ఇస్తున్నారో స్పష్టంగా రాసి ఇవ్వాలి. ఆ రసీదుల్లో నంబర్లు ప్రకారం వాడాలి. ఇక్కడ ఏమి పాటించకపోయినా మైనింగ్ అధికారులు మాత్రం ఆ వైపున వచ్చే పరిస్థితి లేదు. రైతులను,ప్రజల కూడా పట్టించుకోకుండా మైనింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైంది కాదు. చిత్తూర్ లో ఉన్న మైనింగ్ ఏడి తో మేం మాట్లాడుకుంటామని నాకు పర్మిషన్ ఇచ్చారని కాంట్రాక్టర్లు చెప్తుంటే ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతునారో అర్థమవుతుంది. మైనింగ్ రూల్స్ ఒక్కటి కూడా పాటించడం లేదు. రెవెన్యూ అధికారులు మీరు మీరు చూసుకోండి 'మాకేం సంబంధం' అని రైతులకు చెబుతున్నారు. గుండ్లూరు ఇసుక రీచ్ లో భారీ స్థాయిలో ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి చుట్టుపక్కల వందల ఎకరాల రైతులు వ్యవసాయం నష్టపోతున్నారు. కాంట్రాక్టు మీద అంత ప్రేమ ఎందుకు అర్థం కాని పరిస్థితి. సామాన్య ప్రజలు ఇసుకకు కొన్ని వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. సొంత ఊర్లో సొంత ఇసుకను కూడా రైతులు తీసుకునే పరిస్థితి లేదు. ఇసుకతో కాంట్రాక్టర్ మాత్రం కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎలాంటి లోపాలు జరగకూడదని స్పష్టంగా సంబంధిత మంత్రి తెలియజేస్తున్న జిల్లాలోని కొన్ని ఇసుక రీచ్‌లతో ఏ మాత్రం ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు ముఖ్యంగా కలికిరి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. కలికిరి మండలంలో ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల తీరు బాగా లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యను జిల్లా మైనింగ్, రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రైతులు, ప్రజలక న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గాంధీ రోడ్‌లో 'క్లాక్ టవర్'

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్**

స్థానిక గాంధీ రోడ్డులోని పూలమార్కెట్ వద్ద 125 సంవత్సరాల చరిత్ర కలిగిన గడియారం 25 సంవత్సరాల క్రితం మూగబోయింది. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ నరసింహచారి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదంతో స్థానిక ప్రజలు, సీనియర్ సిటిజన్ల ఆలోచనావిధానాలకు పెద్దపీట వేస్తూ పాతతరాల జ్ఞాపకాలను భద్రపరుస్తూ నూతన గడియారం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో స్థానిక కార్పొరేటర్ నరసింహచారి , ఇతర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నారాయణవనం:** విజయసాయిరెడ్డిని అయన స్వగృహంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశా రు. ఆయనకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

## 'రిషిత రెడ్డిని అడ్డుకోవడం అప్రజాస్వామికం'

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి ఇంటింటి ప్రచారాన్ని వైసిపి నాయకులు అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్యని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు మంచి పద్ధతి కాదనీ, ప్రజాస్వామ్యవాదులు అందరూ దీన్ని ఖండించాలని పిలుపునిచ్చారు.

## తప్పుగా వార్తలు రాశారని నిరసన

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఓ దినపత్రికలు రాసిన కథనాలను వ్యతిరేకిస్తూ వైసీపీ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షులు మన్నం ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం యూనివర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి ఆ దినపత్రికలు తప్పుడు రాతలు రాశారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్, సుకుమార్, ముని, నరేష్, శివ, శీను, బోస్ రణదీప్, మనోజ్, అజిత్, శేషు, దేవా పాల్గొన్నారు.

## 'నవలల్లో వ్యాపార ధోరణి వుండదు'

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎస్వీయూలోని సెనేట్ హాల్లో ప్రసిద్ధ సాహితీవేత్త తల్లం పుల్లన్న గుప్త ధర్మనిధి ఉపన్యాసం జరిగింది. ఈ సదస్సులో 'రాయలసీమ నవలా సాహిత్యం–విశిష్టత' అనే అంశంపై ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, ఆచార్యులు పేటశ్రీ, మేడిపల్లి రవికుమార్, మునిరత్నం, దామోదర నాయుడు, భక్తవత్సల రెడ్డి, రామచంద్రారెడ్డి, విఆర్ రాసాని తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-పాకాల:** పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నయ్ శంకర నేత్రాలయ ఆసుపత్రి వైద్య బృందం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహాయ సహకారాలతో ఆదివారం ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి కంటి సమస్యలు ఎదుర్కుంటున్న వారు 124 మంది హాజరయ్యారు. వీరిలో 26 మందికి ఆపరేషన్లు చేయాలని వైద్య బృందం నిర్ధారించింది. వీరిని సోమవారం మధ్యాహ్నం చెన్నయ్ శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్ళి ఉచితంగా వైద్య సేవలతో పాటు భోజనము, వసతి కల్పించి ఆపరేషన్లు చేయనున్నారు. కార్యక్రమంలో మారసాని విజయబాబు, ప్రసాద్, కుప్పస్వామినాయుడు, దొరస్వామినాయుడు, తులసీరామన్ పాల్గొన్నారు.

## మా సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు: వెంకటరామరాజు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించే రాజకీయ పార్టీలకే మద్దతు ప్రకటిస్తామని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2017ఏర్పడిన ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో అన్ని రాజకీయ పక్షాలకు చెందిన వారు ఉన్నారని, బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకు పైగా ఉన్న బ్రాహ్మణుల జనాభా దామాషా ప్రకారం 10 నుంచి 15 శాసనసభ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు ఇస్తామన్న వైసిపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. నాయకులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయితే బ్రాహ్మణులకు కోట్ల నిధులతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందో వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. కామేశ్వర ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లికార్జున, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో టీడీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న వారికి చీరలు పంపిణీ, క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిసిన విన్నర్స్‌కి, రన్నర్స్‌కి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలన్మాజీ, మాజీ ఎమ్మెల్యే హేమలత బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా టీడీపీలోకి 40కుటుంబాలు చేరారు. కార్యక్రమంలో కన్నయ్యానాయుడు, మనోహర్ నాయుడు, రమణయ్యాయాదవ్, వీరరాఘవులు, సత్యం, ఆదిశేషయ్య, మునెయ్య, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలి: మల్లేశ్వరరావు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అనాదిగా కులవృత్తి జీవనంగా బతుకులు వెళ్లదీస్తూ అనగారిన పోతున్న రజక జాతిని ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని, ఆ దిశగా రాజకీయ పార్టీలు నిర్ణయం ప్రకటించాలని నేషనల్ ధోబి మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తిరుపతి నుంచి విజయవాడకు ఆయన తలపెట్టిన పాదయాత్ర ఆదివారం శ్రీవారి పాదాల వద్దనుండి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అలిపిరి పాదాల మండపం వద్ద పూజాది కార్యక్రమాలు చేసి కొబ్బరికాయలు కొట్టి గోవిందా మా మొర ఆలకించి సఫలీకృతం చేయాలని ప్రార్థించారు. రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, కేశన శంకర రావు, కర్నాటక చిత్ర దుర్గ పీఠాధిపతి బసవమాసుదేవ స్వామి పాదయాత్రను ప్రారంభించారు. కార్యమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కుమ్మర క్రాంతి కుమార్, నాగరాజు గౌడ్, రజక సంఘ నేతలు మల్లెమొగ్గల ఉమాపతి, సుధాకర్, దేవానంద్, దాము, యశోద, బాలయ్య పాల్గొన్నారు.

# బీసీలను ఓటర్లుగానే పరిగణిస్తున్నారు : లాకా వెంగళరావు

**ఫిబ్రవరి 4న బిసి పోరాట రథయాత్ర ముగింపు**

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లాకా వెంగళరావు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** 77 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో బీసీలకు రాజ్యాధికారం తగ్గకుండా అల్పసంఖ్యాక వర్గానికి చెందిన వారే రాజ్యాధికారాన్ని అనుభవిస్తూ బీసీలను అణిచివేతకు గురి చేస్తూ కేవలం ఓటర్లుగానే పరిగణించడం చాలా బాధాకరమని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి, బీసీ యువకుల భావితరాల భవిష్యత్తు కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్రను ఇచ్ఛాపురంలో ప్రారంభించామని ఫిబ్రవరి 4వ తేదీన తిరుపతిలో భారీ బహిరంగ సభతో ఈ రథయాత్ర ముగుస్తుందన్నారు. జనాభా దామాషాలు దేశంలో 60శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను, అణిచివేతకు గురవుతున్న బీసీలకు బాసటగా బీసీ అట్రాసిటీ యాక్టును, ప్రైవేటు రంగంలో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ల డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, రాయచోటి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో బీసీలు, 8రాష్ట్రాల నుండి బీసీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారన్నారు. బీసీ జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయింపు చేసే రాజకీయ పార్టీకి మద్దతిస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకా నమ్మ, తురక అమర్నాథ్, జగన్నాథం, ప్రసన్నకుమార్, లక్ష్మణరావు, నారాయణస్వామి, దేవి బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'మహిళలకు రక్షణ కరువైంది'

**ప్రజాశక్తి-రేణిగుంట:** రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని చెప్పడానికి శనివారం శ్రీకాళహస్తిలో జరిగిన ఘటనే నిదర్శనమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో ధైర్యం నింపడానికి, వారి సమస్యలు తెలుసుకోవడానికి తమ నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రుషిత రెడ్డి చేపట్టిన ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమానికి విశేష స్పందన రావడం చూసి అధికార పార్టీ వారికి మతిపోయిందన్నారు. దీంతో శనివారం ప్రచారం నిర్వహిస్తున్న రిషితా రెడ్డి కార్యక్రమాన్ని అడ్డుకొని భయభ్రాంతులకు గురిచేయలని వైసీపీకి చెందిన కొందరు అల్లరి మూకలు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిపారు. మహిళలు అందరూ ఇలా ప్రచారం నిర్వహిస్తుంటే వారిపైకి దాడికి యత్నించడం ఎంతవరకు సబబని, ఇదేనా రాష్ట్రంలో అమలవుతున్న మహిళల రక్షణ అని ప్రశ్నించారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు రాష్ట్ర ప్రజలు మహిళలు ఎప్పుడెప్పుడా అని కాసుకొని ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# సెబ్ చే బహు భాషా కార్యక్రమాలు

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** రజతోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఆసియాలో మొట్టమొదటి లిస్టెడ్ డిపాజిటరీ అయిన సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్), రెండు ప్రత్యేకమైన బహుభాషా కార్యక్రమాలను ప్రారంభించినట్లు సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బుచ్, సీఈఓ నేహాల్ ఓరా తెలిపారు. ఆ సంస్థ రజతోత్సవ సంవత్సరాలు పురస్కరించుకొని వారు మీడియాతో మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వినియోగదారుల మన్ననలను పొందుతూ ముందుకెళుతున్నామన్నారు. మా సంస్థ ద్వారా కొత్తగా ఆవిష్కరించబడిన ఇంక్లూజివిటీ కీలక మైలురాయిగా నిలుస్తాయి అన్నారు. దేశవ్యాప్తంగా మా సంస్థను విస్తరించాలని ఉద్దేశంతో బహుభాషల్లో మా సంస్థ కీర్తిని ప్రచారం చేస్తున్నామన్నారు.

# వన్నె రెడ్డి సంఘం భవనం నిర్మాణానికి భూమి పూజ

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** వన్నె రెడ్డి సంఘం నూతన భవన నిర్మాణానికి మంజూరైన స్థలంలో ఆదివారం మంత్రి ఆర్‌కే రోజా భూమిపూజ చేశారు. స్థానిక బైపాస్ రోడ్డులో కొండల చెరువు సమీపంల ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వన్నె రెడ్డి కుల సంఘాల అధ్యక్షుడు వెంకటేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, భాస్కర్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

# క్రికెట్ పోటీ విజేత 'టీకేఎం పేట'

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** యువతను క్రీడల్లో ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడలు నిర్వహిస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిం చిన మండల స్థాయి క్రికెట్ పోటీలో విజేతలుగా నిలిచిన టీకేఎం పేట క్రీడాకారులు క్రికెట్ క్రీడా సామగ్రిని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మారు మూల గ్రామాల్లో క్రీడా కారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని విజేతలుగా నిలవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో మోహన మురళీ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడా జట్టు నియో జకవర్గం స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపి కార్వేటినగరం మండలానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో భాగంగా క్రికెట్ విజేతలుగా నిలిచిన టీకేఎం పేట క్రీడా జట్టుకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, ఈవో పీఎన్ మణి, పీడీలు మురళీకృష్ణరాజు, పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థుల అపూర్వ కలయిక

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుండ్రం హైస్కూల్లో 1985- 86 సంవ త్సరం మధ్య 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తూగుండ్రం జడ్పీ హైస్కూల్ ఆవరణలో 38 ఏళ్ల తర్వాత ఒకటయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దొరైరాజ్ , కృష్ణన్, దేవరాజులు నాయుడు, రామానాయుడు, మాధవన్, మోహన్ పిళ్ళై, మనోహర్‌లకు పూల మాలలు వేసి శాలువా లతో ఘనంగా సన్మానించారు. అనంతరం టీచర్లకు పాదపూజ చేసి పూర్వ విద్యార్థులు తమ గురుభక్తిని చాటుకున్నారు. పూర్వ విద్యార్థుల ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య కారకులైన రాజేంద్ర నాయుడు, నటరాజ్ మొదలి, ఏకాంబరరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, షబ్బీర్‌అలీ, శ్రీనివాసులు మొదలి, సత్యమూర్తి, బాలకృష్ణారెడ్డి, జగదీష్ నాయుడు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్ర మంలో టీచర్ లు దేవరాజులు మందడి, హేమ, గుణశేఖర్ నాయుడు, రిటైర్డ్ టీచర్ లు కమ్మరల్లీ, ఆర్ముగం పిళ్లై పాల్గొన్నారు.

# తండ్రిపై అభిమానం

**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** తండ్రి జ్ఞాపకాలు మరువలేక కొడుకులు జల్లికట్టులో తమ తండ్రి చిత్రపటంతో జల్లికట్టులో చెక్క పట్టీలను కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. మండలంలో మాంబేడు గ్రామంలో ఆదివారం గ్రామస్తులు జల్లికట్టు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మండలాల నుంచి ఎద్దుల యజమానులు ఎద్దులతో ఆ గ్రామానికి చేరుకున్నారు. ఆ గ్రామానికి చెందిన. బోడి రెడ్డి చిన్నమ్మ రెడ్డి గత సంవత్సరం మృతి చెందాడు. తండ్రి గుర్తుకొచ్చాడో ఏమో.. బోడి రెడ్డి పరుశురామరెడ్డి తమ్ముడు భగీదర్ రెడ్డి ఇద్దరూ కలిసి తన తండ్రి జ్ఞాపకంగా కొయ్య పట్టిలలో తన తండ్రి చిత్రపటం అతికించి ఎద్దు కొమ్ము లకు కట్టి అల్లివైపు వదిలారు. అందరూ ఆశ్చర్యంగా చూస్తూ తండ్రి పై ఉన్న అభి మానాన్ని కుమా రులు ఇలా చాటు కున్నారని అభినం దించారు.

# సంక్షిప్త సమాచారం

## 'దళితులు జగన్‌ని నమ్మరు'

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** జగన్ ఎన్ని డ్రామాలు చేసినా దళితులు నమ్మరని టిడిపి నేతలు బొజ్జల రిషితా రెడ్డి, చక్రాల ఉష విమర్శించారు. రాజకీయ మైలేజీ కోసం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించినా, జగన్ దళితులకు చేసిన అన్యాయాన్ని మర్చిపోరని చెప్పారు. రిషితా రెడ్డి, ఉష ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. కోడి కత్తి డ్రామా ఆడి శీను అనే దళితుడిని జగన్ ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిప్పుతూ హింసిస్తున్నాడనీ, తన స్వార్థం కోసం శీను కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జగన్ పాలనలో ఎంతో మంది దళితులు హత్యకు గురయ్యారనీ, ఎంతోమంది దళిత మహిళలు అత్యాచారాలకు బలయ్యారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే దళితులు నమ్మే పరిస్థితుల్లోలేరని స్పష్టం చేశారు. సుమతి, సుభాషిని, అనిత, చంద్రకళ, సుజాత, అమ్ములు, ఊహ, జైశ్రీ, అమరావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**ప్రజాశక్తి-క్యాంపస్:** ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా అబాకస్ శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ఆర్.కె.అబాకస్ ఛైర్మన్, డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె.రెడ్డి విమల ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఆర్.కె.రెడ్డి, విమల మాట్లాడుతూ స్థానిక ఎం.ఆర్.పల్లి కూడలి నందు గల ఆర్.కె.అబాకస్ శిక్షణా కేంద్రం నందు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు గత 13 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తున్న ఏకైక శిక్షణ సంస్థగా తిరుపతి నందు ఆర్.కె.అబాకస్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ అబాకస్ శిక్షణ ఇస్తూ, అందులో ప్రావీణ్యత చూపినటువంటి హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి ఆద్విక్ 3వ విభాగం నందు ప్రథమ బహుమతి పొందారన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్.కె.విమల, అధ్యాపక బృందం బి.ప్రతాప్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సైనిక, రక్షణ రంగంలో, వార్తా పత్రికలు, పోలీస్ రంగాలలో పనిచేసే ఉద్యోగుల పేద విద్యార్థిని విద్యార్థులకు రాయితీతో పాటు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు చక్కటి అబాకస్ శిక్షణ కొరకు మరిన్ని వివరాలకు 9989500074, 7386502450 సంప్రదించాలన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు

**- మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్**

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27సంక్షేమ పథకాలను ఎత్తి వేసిన సీఎం జగన్మోహన్ రెడ్డికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో 206అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని సుమారు రూ.400కోట్ల నిధులతో అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు సంకల్పించిన వ్యక్తి చంద్రబాబు అని తెలిపారు. అయితే అంబేద్కర్ పేరు మీద ఉన్న విదేశీ విద్య పథకానికి పేరు మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు జరిగాయన్నారు. వీటిన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎంకి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచురామయ్య, రహీమ్, ఇశ్రాయిల్ కుమార్, శ్రీనివాసులు, పెంచలయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

# ఘనంగా 'మట్టిఅద్దం' పుస్తకావిష్కరణ

మట్టి అద్దం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** సమకాలీన సామాజిక అంశాలు తెలుగు బాషా, సంస్కృతి, విద్య, ప్రకృతి, పర్యావరణం, కుటుంబ బంధాలు, మానవ విలువల పతనం పట్ల ప్రశ్నించే తత్వమే యువశ్రీ మురళి కవితా సంపుటి మట్టిఅద్దం అని, ఈ కవిత్వం సమాజానికి దర్పణమని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ అధిపతి రాజేశ్వరమ్మ అన్నారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్‌లో అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు యువశ్రీ మురళి కవితాసంపుటి మట్టిఅద్దం పుస్తకావిష్కరణ సభ డాక్టర్ నెమిలేటి కిట్టన్న అధ్యక్షతన సాయంత్రం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్వేత పూర్వ సంచాలకులు భూమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన్ మాట్లాడుతూ పల్లెటూరి మట్టి వాసనలకు మట్టిఅద్దం కవితలు దర్పణమన్నారు. కవి యువశ్రీమురళి ఉపాధ్యాయ, భాషోద్యమ నాయకులుగా మట్టిఅద్దం కవితల్లో మానవీయ విలువల్ని ఆవిష్కరించారని సమీక్షకులు, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు అన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్, గంగవరం శ్రీదేవి, గంటా మోహన్, పేరూరు బాలసుబ్రమణ్యం, శతావధాని ఆముదాల మురళి, తమటం రామచంద్రారెడ్డి, గండుపల్లి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆదాయం కన్నా జగన్ ఆదాయమే పెరిగింది: నరసింహ యాదవ్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాష్ట్ర ఆర్థిక పురోగతి లేకపోయినా జగన్ ఆదాయం మాత్రం విపరీతంగా పెరిగిందని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది వైసీపీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచబోనని చెప్పిన జగన్ ఇప్పటివరకు 9పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారన్నారు. దశలవారీగా మద్యపాన నిషేధం అని చెప్పి నాసిరకం మద్యాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చి ప్రజల ప్రాణాలను బలికొంటున్నారన్నారు. ప్రజలకు దీర్ఘకాలిక సంక్షేమం అందించడంలో టీడీపీ ముందుంటుందని, ప్రజలకు అవసరమైన పంట కాలువలు, రోడ్డు మార్గాలను వేశామన్నారు. అయితే నేడు రైతు పంట కాలువల్లో రైతుల కన్నీళ్లు పారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నంలో వారిపై అక్రమ కేసులు, దాడులు చేయించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని, టిడిపి అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక యాక్ట్ తీసుకురానున్నామన్నారు. చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను మీడియాకు వివరించారు. జగన్మోహన్‌రెడ్డిని ఆయన సొంత ఎమ్మెల్యేల నమ్మడం లేదని ప్రజాభిమానంతో అధికారం చేపట్టాలని దొంగ ఓట్లు కాదని హితవు పలికారు. కార్యక్రమంలో వూకా విజయ్ కుమార్, బుల్లెట్ రమణ, జగన్నాథం, మునికృష్ణ, మనోహర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహ యాదవ్

# ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పుట్టినరోజులు పురస్కరించుకొని టిడిపి సీనియర్ నాయకులు జి జె ఎం ఛారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్ మోహన్ టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన 72 కిలోల భారీ కేకును కట్‌చేసి అభిమానుల సమక్షంలో పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్, రాష్ట్ర మొదలియార్ సంఘం అధ్యక్షులు సిఎంటి త్యాగరాజన్, గురజాల చెన్నకేశవ నాయుడు కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు,మాజీ కార్పొరేటర్లు కందా, ఈశ్వర్, ఆనంద్, శేషాద్రి, టిడిపి నాయకులు రాజశేఖర్,మదన్ తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొరబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జి జే ఎం ట్రస్ట్ అధినేత జగన్మోహన్

## వైసీపీ ఇంటికివెళితేనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** వైసీపీ ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం చిత్తూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంజి మాధవయ్య పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరులో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఆదాయం పెరగలేదు, ఉద్యోగాలు రాలేదన్నారు. వైసీపీ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రూరల్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుడి కుటుంబానికి చిత్తూరు నగరానికి చెందిన గురుజాల జగన్మోహన్ ( జిజెఎం ) ఛారిటబుల్ ఫౌండేషన్ బాసటగా నిలిచింది. చిత్తూరు నగరంలోని 10 వ డివిజన్ టిడిపి కార్యకర్త కె రవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడు రవి కుటుంబాన్ని ఆదివారం జిజెఎమ్ ఫౌండేషన్ అధినేత గురజాల జగన్మోహన్ పరామర్శించి, ఆ కుటుంబానికి పెద్ద దిక్కయిన రవి సోదరి దేవికమ్మకు తక్షణ సాయం కింద రూ 50 వేల నగదును అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రవి కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు శేషాద్రి, ఆనంద్, మదన్ తో పాటు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## జోరుగా 'కులగణన సర్వే'

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** కుల గణన సర్వే మండలంలోని సచివాలయాల్లో ఆదివారం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆన్‌లైనులో కులాలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు సచివాల సిబ్బంది ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని కులాలు ఉప కులాలను ఆన్లైన్లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నట్టు ఇందుకు ప్రతి ఒక్క రూ సహకరించి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వెంకటేష్ గ్రామ వాలంటరీ లు పాల్గొన్నారు.

## ఇస్తిమ స్థలాన్ని పరిశీలించిన మంత్రి

**ప్రజాశక్తి -పుంగనూరు:** పట్టణ సమీపంలో ఈ నెల 24 ,25 తేదీల్లో ఇస్తిమాను నిర్వహిస్తున్నారు. నిర్వహణ స్థలంలో చేపట్టిన ఏర్పాటును భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. మంత్రితో పాటు మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష, జిల్లా వర్క్ బోర్డ్ ఛైర్మన్ అమ్ము, ముస్లిం మత పెద్దలు, స్టేట్ అండ్ ఫోక్ కల్చరల్ ఛైర్మన్ కొండ వీటి నాగభూషణం, న్యాయవాది అంజిబాబు పా ల్గొన్నారు.

# ఘనంగా మైలేరు పండుగ

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** బైరెడ్డిపల్లి మండలం కుటాలవంక గ్రామంలో ఆదివారం మైలేరు (ఎద్దుల పరుగు పందెం)పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రం ఎద్దులు అధిక సంఖ్యలో పాల్గొనటం విశేషం. పోటీలో పాల్గొన్న ఎద్దులను చక్కగా అలంకరించారు. ఈ పోటీలు తిలకించటానికి పలు ప్రాంతాలు నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో గ్రామం జనసంద్రంగా మారింది. చిన్న గ్రామానికి వందల్లో ఎద్దులు తరలి రావడం గ్రామం కలకళలాడుతోంది. ఈపోటీలో ప్రథమ బహుమతి 1లక్ష రూపాయిలు, ద్వితీయ బహుమతి 75 వేల రూపాయలు, తృతీయ బహుమతి 50 వేల రూపాయలు, వికోట మండలం ఎద్దులు కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలో 51 బహుమతులను నిర్వాహకులు పంపిణీ చేశారు.

## అవార్డు గ్రహీతకు అభినందనల వెల్లువ

**ప్రజాశక్తి-గంగవరం:** మండలంలోని గుండిగల్లు గ్రామానికి చెందిన రాధాకృష్ణకి తమిళనాడుకు చెందిన ఏసియన్ ఇంటర్నేషనల్ అకాడమీ రిసోర్స్ కోయంబత్తూరు చొరవతో ప్రభుత్వం తరపున డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. రాధాకృష్ణ 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు తన స్వగ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మించి అనేక రకాల సేవా కార్యక్రమంలో సామూహిక వివాహాలు, అన్నదానం, బడుగు బలహీన వర్గాల వారికి వస్త్ర దానం, అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడాన్ని గుర్తించి ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. మన రాష్ట్రంలోనే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా పలు సేవా కార్యక్రమాలు చేసినట్లు గుర్తిం చిన ఆ సంస్థ తమిళనాడు ప్రభుత్వం సహకారంతో ఈ డాక్టర్ ప్రదానం చేసినట్లు తెలిపారు. తమ గ్రామ వాసికి డాక్టరేట్ రావ డంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రాధాకృష్ణ గతంలో తమ గ్రామానికి ఎంపీటీసీగా పని చేశారని గ్రామ స్తులు తెలిపారు. భవిష్య త్తు లో మరిన్ని సేవా కార్య క్రమాలు చేసి ఇంకా పలు అవా ర్డులు పొందా లని గ్రామస్తు లు, బంధువు లు కోరి నట్లు ఆయన తెలిపారు.

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాశక్తి-తడ:** బైక్‌ని ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని చేనిగుంట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కావలి మధురపాడు గ్రామానికి చెందిన సాయివంశీ(27) తడలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. రోజులాగే సూళూరుపేట నుంచి తడకు వెళుతుండగా చేనిగుంట సమీపంలో జాతీయ రహదారిపై హఠాత్తుగా ట్రాక్టర్ అదుపుతప్పి సాయివంశీ బైక్‌ను ఢీకొంది. దీంతో సాయివంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

KKC COLLEGE OF LAW
KKC Nagar, PR Mangalam, Puttur - 517 584, Tirupati Dist, A.P.
Ph No : 7799723313 / 22 Email : kkclawprincipal@gmail.com Website : kkclaw.org
LL.B/B.A.LL.B/LLB[Hons] Spot/ M.Q. Admissions 2023-2024

For left over vacancies, dropout vacancies, cancelled seats of 3 & 5 year LLB courses. The candidates who are qualified in LAWCET - 2023 may attend the spot Admissions during 23rd to 31st Jan 2024 between 10.00am to 4.00pm at college office.

| Course | Intake Seats | Filled Conventer Seats | Vacant Seats for Spot Admissions | EWS | Management Quota Seats |
|---|---|---|---|---|---|
| 3 Year LL.B | 300 | 18 | 222 | 30 | 60 |
| 5 Year B.ALL.B | 60 | 06 | 42 | 06 | 12 |
| 3 Year LL.B (Hon). | 120 | 17 | 79 | 12 | 24 |

* Subject to approval by BCI, New Delhi

For LL.B 3/5 Year, 3Year LLB(Hons) Courses, Spot / Management Quota Seats Under category - A & B are available in spot admissions in our college.
Note : The Admissions under spot for left over / unfilled Vacancies of 3/5 Year be made an merit basis as per the guidelines of A.P.S.C.H.E. and rules of reservations category wise prescribed by Govt. of Andhra Pradesh.
Filled in Applications along with copies of relevant certificates may be submitted in the college office in person or by post on any working day between 10am to 5pm to reach on or before 30-01-2024.
It should be noted that the candidates who are admitted under spot admissions of any category shall not be eligible for scholorship / tuition fee Re-imbursement.

Date : 22-01-2024 PRINCIPAL